క్లుప్తంగా

రేపటి నుంచి వెంకటేశ్వర స్వామి పవిత్రోత్సవాలు

వేంపల్లి : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న వృషభాచలేశ్వరస్వామి అనుసంధానమైన వెంకటేశ్వరస్వామి ఆలయంలో సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వేణుగోపాల్ సహకారంతో జూన్ 1 నుండి 3వ తేదీ వరకు స్వామివారి పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ విశ్వనాథ రెడ్డి, అర్చకులు అచ్యుత్ నారాయణాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

మహానాడులో తప్పిపోయిన వ్యక్తి


నాగార్జున (ఫైల్)

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలపల్లె దళితవాడ గ్రామానికి చెందిన కొట్లూరు నాగార్జున పబ్బాపురం గ్రామ సమీపంలో జరిగిన మహానాడు కార్యక్రమానిక వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు కొట్లూరు సుబ్బరామయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగార్జున మాట్లాడలేడని, కేవలం మాటలు అర్థం చేసుకోగలడని వారు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9704738376, 9000991161 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ప్రిన్సిపాల్‌కు ఘన సన్మానం


ప్రిన్సిపాల్ యోగాంజనేయులును సత్కరిస్తున్న అధ్యాపకులు

వేంపల్లె : స్థానిక పట్టణ వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందుతున్న డాక్టర్ చెరసాల యోగాంజనేయులును ఘనంగా సత్కరించారు. శుక్రవారం ఆయన పదవీ విరమణ పురస్కరించుకుని కళాశాల స్టాఫ్ క్లబ్ ఆధ్వర్యంలో స్టాఫ్ క్లబ్ అధ్యక్షుడు బాలకొండ గంగాధర్ అధ్యక్షతన అధ్యాపకులు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ సుధాకర్, పీఆర్‌ఓ డాక్టర్ బాల నారాయణ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు ఎక్కడ సంతోషంగా ఉన్నారో చెప్పండి

చక్రాయపేట : కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులు ఎక్కడ సంతోషంగా ఉన్నారో కూటమి ప్రభుత్వ నేతలు చెప్పాలని చక్రాయపేట జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి కోరారు. కడపలో జరిగిన మహానాడులో తమ ప్రభుత్వ హయాంలో రైతులు సంతోషంగా ఉన్నారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మామిడి, నిమ్మ, టమోట, ఉల్లి, మిరపతో పాటు కూరగాయలు సాగుచేసిన రైతులు గిట్టు బాటు ధరలేక తీవ్రంగా నష్టపోయారన్నారు. వర్షాలు కురియక బోర్లు ఎడిపోయి నీళ్ల లేక రైతులు అప్పుల పాలై దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. జగనన్న ప్రభుత్వ హయాంలో రైతులకు అనేక సంక్షేమ పథకాలు అందించి ఆదుకున్నాడన్నారు. ఈ ప్రభుత్వంలో ఏఒక్క కుటుంబానికైనా సంక్షేమ పథకాలు ఇచ్చారా అని ఆయన ప్రశ్నించారు. మామిడి రైతులు ఇన్సూరెన్స్ కొరకు ప్రీమియం కట్టినా బీమా ఇవ్వలేదన్నారు. మరి రైతులు సంతోషంగా ఉన్నారని ఎలా చెబుతారని ఆయన ప్రశ్నించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

సింహాద్రిపురం : పైడిపాలెం గ్రామంలో గ్రామస్తుల సహాయ సహకారంతో నూతనంగా నిర్మించిన శ్రీఅంకాలమ్మతల్లి దేవాలయంలో శుక్రవారం శ్రీఅంకాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మూడు రోజుల నుంచి శ్రీ ఛండీ, రుద్ర హోమాలు నిర్వహించి అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారు జామున యంత్ర ప్రతిష్ట, బింబ ప్రతిష్ట, సింహవాహనం, పోతులయ్య ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్టలు నిర్వహించి అమ్మవారికి వాయనాలు, పట్టుచీర, గాజులు, సుగంధ ద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి ఆచరించి శిఖర ప్రోక్షణ నిర్వహించారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

వీరపునాయునిపల్లె : ఖరీఫ్‌కు సంబంధించి పంటలు సాగు చేసేందుకు వేరుశనగ కాయలను 40 శాతం రాయితీతో ప్రభుత్వం అందిస్తోందని దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం ఎస్.పాలగిరి రైతు సేవా కేంద్రంలో విత్తన నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కమలాపురం : దాతలు ముందుకు వచ్చి ఏర్పాటు చేస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటే జ్ఞాన సముపార్జన పెంపొందించుకోవచ్చని సీఎస్‌ఎస్‌ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి, ఆర్యవైశ్య కమిటీ చైర్మన్ కె.వెంకటరమణయ్య తెలిపారు. స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో 15 రోజులుగా ప్రొద్దుటూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ నిర్వహించారు.

ఆడబిడ్డ నిధికి శఠగోపం

- 18 ఏళ్లు దాటిన వారందరికి నెలకు రూ.1500లు ఇస్తామని
- 12 నెలలైనా నెరవేర్చని హామీ.. మోసపోయిన మహిళలు

పులివెందుల : ఎన్నికలలో ఎలాగైనా గెలవాలన్న కాంక్షతో టీడీపీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను మడతపెట్టింది. సూపర్ సిక్స్, రైతు సంక్షేమం, మహిళా సంక్షేమం ఇలా ప్రతి వర్గానికి హామీలు ఇచ్చిన చంద్రబాబు తీరా గద్దెనెక్కాక వాటిని తుంగలో తొక్కారు. హామీల అమలును విస్మరించారు. ఇందులో ఉన్నదే ఆడబిడ్డ నిధి. ఈ పథకం కింద 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్క మహిళలకు నెలకు రూ.1500ల ఆర్థిక సహాయం అందిస్తామని ఎన్నికలలో వాగ్దానం చేశారు. దీనికి ఎంతో ప్రచారం కల్పించారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళా సంక్షేమాన్ని విస్మరించడమేకాక ఈ ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయడం మరిచిపోయారు.

కోట్లాది రూపాయలు మోసపోయిన మహిళలు

పులివెందుల నియోజకవర్గంలో మహిళలకు కూటమి ప్రభుత్వం కోట్లాది రూపాయలు చెల్లించాల్సిన ఆడబిడ్డ నిధి సొమ్మును చెల్లించకుండా మోసం చేసింది. 2024 జూన్ లెక్కల ప్రకారం పులివెందుల నియోజకవర్గంలో 18 ఏళ్లు నిండిన, ఆపై వయస్సు కలిగిన వారు 59,607 మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.1500ల చొప్పున చొప్పున రూ. 5,96,07,500లు చెల్లించాలి. ఈ లెక్కన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2024 జూన్ నుంచి 2025 మే వరకు 12 నెలలకు కోట్లాది రూపాయలు చెల్లించాల్సి ఉంది.

పులివెందుల నియోజకవర్గం..

మండలం	మహిళలు	లబ్ధి (రూ.నెలకు)
పులివెందుల	59,607	రూ.5,96,07,500
లింగాల	18305	రూ.2,70,52,500
తొండూరు	15912	రూ.2,38,68,000
వేముల	19994	రూ.2,99,91,000
వేంపల్లె	44,179	రూ.6,62,68,500
సింహాద్రిపురం	24,283	రూ.3,64,24,500
చక్రాయపేట	19,905	రూ.2,98,57,500

జమ్మలమడుగు..

జమ్మలమడుగు : 2024 లెక్కల ప్రకారం నియోజకవర్గంలో 1,24,572 మంది మహిళలు ఉన్నారు. వీందరికి రాష్ట్ర ప్రభుత్వం రూ.225 కోట్లు గతేడాది జూన్ నుంచి ఈ ఏడాది మే వరకు అంటే 12 నెలలకు ఆడబిడ్డ నిధి కింద డబ్బులు చెల్లించాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆడ బిడ్డ నిధి అమలులో యువతులకు మోసం చేసింది. ప్రతినెల రూ.18.68 కోట్లు ఈ పథకం కింద లబ్ధిదారులకు చేరవలసి ఉంది.

జమ్మలమడుగు నియోజకవర్గం

మండలం	స్త్రీలు	ఏడాదికి (లబ్ధి)
పెద్దముడియం	12062	21,71,16000
మైలవరం	16659	29,98,62000
జమ్మలమడుగు	32886	59,21,28000
కొండాపురం	18317	32,97,06000
ముద్దనూరు	13978	25,16,04000
ఎర్రగుంట్ల	30670	55,20,60000
మొత్తం	124572	224,22,96000

చంద్రబాబు అబద్ధపు హామీలు ఇచ్చారు



చంద్రబాబు నాయుడు మహిళలకు అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. అధికారంలో వచ్చిన తర్వాత మహిళలకు చెప్పిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదు. ఆడబిడ్డ ఏడాదికి రూ.18 వేలు ఇస్తామని చెప్పారు. ఒక రూపాయి కూడా ఇవ్వలేదు

– అలీమా, స్థానికురాలు, పులివెందుల

ఉచిత బస్సు తుస్సు



టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత బస్సు తుస్సు అయింది. మహిళలందరికీ చంద్రబాబు నాయుడు మాయమాటలు చెప్పారు. చంద్రబాబు నాయుడును రాష్ట్రంలో ఏ ఒక్క మహిళ కూడా నమ్మదు.

– పీరమ్మ, స్థానికురాలు, పులివెందుల

జగనన్న ప్రభుత్వంలో మహిళలు మహారాణులు



వైఎస్సార్‌సీపీ అధినేత జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన హయాంలో మహిళలందరూ మహారాణులుగా ఉండేవారు. మహిళలందరికీ అమ్మఒడి పథకం ద్వారా డబ్బులు వచ్చేవి. కానీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల కోసం చెప్పిన హామీలను చంద్రబాబు నాయుడు ఒకటి కూడా అమలు చేయలేదు. కూటమి ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతాం.

– శివమ్మ, స్థానికురాలు, పులివెందుల

మాట నిలబెట్టుకోవాలి



ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో చాలా హామిలు ఇచ్చారు. అందులో ఆడ బిడ్డ పథకం ఒకటి. గతప్రభుత్వం 45 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి ఏడాదికి 18700 రూపాయలు వేసింది. అయితే చంద్రబాబు నాయుడు 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి నెలకు 1500 ఇస్తామన్నారు. పథకం వెంటనే అమలు చేయాలి.

– సునీతమ్మ, గొరిగేనూరు ,జమ్మలమడుగు.

ఏడాది అవుతున్న పథకం అమలు కాలేదు



ఆడబిడ్డ పథకం కింద ప్రతినెల 18 సంవత్సరాలు దాటిన మహిళలకు రూ.1500 ఇస్తామని ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఏడాది అవుతుంది. ఇంత వరకు అమలు చేయలేదు. ఈ పథకం అమలు అయి ఉంటే తమకు రూ.18000 పడాలి. ఇంత వరకు ఒక్కపైసా కూడ పడలేదు.

– మమత, చింతకుంట గ్రామం, ముద్దనూరు

మహిళా ద్రోహి చంద్రబాబు



మాలాంటి నిరుపేద మహిళలు పెట్టుకున్న ఆశలపై అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు ఆశలపై నీల్లు చల్లారు. మహిళలకు ఉచిత బస్సు గడువు పొడిగిస్తూ మోసానికి పాల్పడుతున్నాడు. ఆడబిడ్డల ఉసురు తగులుకోక తప్పదు. జగనన్న ప్రభుత్వంలో అమ్మ ఒడి, సున్నా వడ్డీ సకాలంలో అందించడంతో ఆడబిడ్డలు ఎంతో సంతోషంగా ఉండేవారు. ప్రస్తుతం ప్రతి ఆడబిడ్డ కష్టాల్లో ఉంది.

– బాగ్యలక్ష్మి, స్థానికురాలు, వీరపునాయునిపల్లె

ఆడబిడ్డలకు చంద్రబాబు ద్రోహం చేశాడు



ఎన్నికల సమయంలో మహిళలకు ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామి ఇచ్చారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్న ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేయకుండా ఆడ బిడ్డలకు ద్రోహం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలు చెప్పి మహిళలను మోసం చేసింది.

– ఈ.లక్ష్మీదేవి, గృహిణి, పాతసంగటిపల్లె, పెండ్లిమర్రి.

విద్యా రంగంలో సంస్కరణలు తెచ్చిన ఘనత వైఎస్ జగన్‌దే

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామలారెడ్డి


వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామలారెడ్డి

వేంపల్లె : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో విద్యా రంగంలో ఎన్నో సంస్కరణలు తెచ్చిన ఘనత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామలా రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం వేంపల్లెలో అసంపూర్తిగా నిలిచి పోయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను, గుంతలు పడ్డ కడప – పులివెందుల ప్రధాన రహదారిని జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు మునీర్, యువ నాయకుడు రోహన్ నాగిరెడ్డిలతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటిరకు ఏ ముఖ్యమంత్రి చేయనంత రూ.72.50 కోట్లు విద్యా రంగానికి జగన్ మోహన్ రెడ్డి ఖర్చు చేశారని, అలాగే ఎన్నో ప్రభుత్వ కళాశాలలు మంజూరు చేయడం జరిగిందన్నారు. అందులో వేంపల్లెలో వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.20 కోట్లు నిధులు మంజూరు చేయగా.. 60 శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్న పెండింగ్ పనులు చేయకపోవడం శోచనీయమన్నారు. పెండింగ్ బిల్లులు కాంట్రాక్టర్‌కు మంజూరు చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే వదలి వేసి వెళ్లి పోవడం జరిగిందన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేస్తే ఎక్కడ జగన్ మోహన్ రెడ్డికి పేరు వస్తుందోనని వాటిని పట్టించుకున్నా పాపాన పోలేదన్నారు. వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంచి అనువైన వాతావరణంలో నిర్మించినప్పటికీ కూటమి ప్రభుత్వం పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు దృష్టి సారించలేదన్నారు. కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులను మంజూరు చేస్తే ఎంతో మంది విద్యార్థులు ఇక్కడికి వచ్చి చదువుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. వారి భవిష్యత్ కూడా చాలా బాగుంటుందని, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు చిన్న విన్నపం చేస్తున్నామన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు విద్య ఒక్కటే వెలుగునిచ్చేటువంటి అసలైన జ్యోతి అని మంత్రి లోకేష్ గమనించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు భారతి, రామచంద్రా రెడ్డి, భరత్, సునీల్, అసనయ్య, గాతాల శ్రీను, లోకేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సమాధి వద్ద నివాళులు

మండలంలోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న వైఎస్ఆర్ సమాధికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామలారెడ్డి ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం వేంపల్లెలో పర్యటనలో భాగంగా ఆమె ఇడుపులపాయను సందర్శించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో ఉన్న వైఎస్ఆర్ సమాధి వద్దకు చేరుకుని పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నేతలు రోహన్ నాగిరెడ్డి రామచంద్రారెడ్డి, చక్రాయపేట జెడ్పీటీసీ బెల్లం ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఈశ్వరరెడ్డిలతోపాటు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి ఇంటికి శ్యామలారెడ్డి విచ్చేసి తేనేటి విందును స్వీకరించారు.

వైఎస్ ప్రమీలమ్మను కలిసిన శ్యామల


శ్యామలారెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల రూరల్ : పులివెందుల మాజీ మున్సిపల్ చైర్మన్ వైఎస్ ప్రమీలమ్మను శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామలారెడ్డి కలిశారు. వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ ప్రమీలమ్మలు ఆమెతో పలు విషయాలపై చర్చించారు. అనంతరం శ్యామలారెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆర్‌సీడీఎస్ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, సంపత్, ఫకృద్దీన్, రవి, పద్మనాభరెడ్డి, శ్రీరాములు, సుభాష్, భార్గవి, ప్రసన్నలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సంత మార్కెట్ ద్వారా రూ.57 లక్షల ఆదాయం

వేంపల్లె : వేంపల్లె పంచాయతీకి సంబంధించి సంత మార్కెట్‌కు వేసిన వేలం పాట ద్వారా రూ.57.05లక్షల ఆదాయం వచ్చినట్లు పులివెందుల డీఎల్పీఓ రమాదేవి తెలిపారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు ఆధ్వర్యంలో పంచాయతీ సంత మార్కెట్‌కు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటకు మధుశ్రీ దేవి, వెంకట రమణారెడ్డి, ఈశ్వరరెడ్డి అనే ముగ్గురు వ్యక్తులు వేలం పాటలకు డీడీలు తీశారు. అయితే డీడీ తీసిన మధుశ్రీ దేవి అనే మహిళ వేలం పాటకు హాజరుకాకుండా ఆమె భర్త వేలం పాటకు హాజరు కాగా.. పాటదారులు వ్యతిరేకించడంతో మధుశ్రీ దేవికి చెందిన భర్తను వేలం పాటను పాడేందుకు వీలు లేదని డీడీని రద్దు చేయాలని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు చెప్పారు. దీంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. అనంతరం అందరిని బయటికి పంపించి డీడీలు తీసిన ఇద్దరు వ్యక్తులు మధ్య వేలం పాట నిర్వహించారు. దీంతో పోటాపోటీగా వేలం పాట కొనసాగింది. గత ఏడాదిలో 10 నెలలకు గాను రూ40.30లక్షలు పంచాయతీకి ఆదాయం రాగా.. ఈ ఏడాది రూ.57.05 లక్షల రాగా దాదాపు రూ.17లక్షలు అదనంగా ఆదాయం పెరిగింది. ఈ వేలం పాటలో మల్లూరు వెంకటరమణారెడ్డి సంత మార్కెట్ వేలం పాటను దక్కించుకున్నారు. పంచాయతీకి చెందిన షాపింగ్ గదులకు చెందిన వేలం పాటను అధికారులు వాయిదా వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ గురునాథ్ సింగ్, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, పంచాయతీ సిబ్బంది, వేలం పాటదారులు పాల్గొన్నారు.

నేడు రవీంద్ర విద్యా సంస్థ ప్రారంభం


ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న రవీంద్ర విద్యాసంస్థ

వీరపునాయునిపల్లె : మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో శనివారం ఉదయం 10 గంటలకు రవీంద్ర విద్యా సంస్థ ప్రారంభించనున్నట్లు రవీంద్ర విద్యాసంస్థల వ్య వస్థాపకుడు పల్లేటి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కమలాపురం శాసన సభ్యులు పుత్తా చైతన్యకుమార్‌రెడ్డి, శివదర్శనానంద సరస్వతి మాతాజి హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. గత 28 సంవత్సరాలుగా ప్రొద్దుటూరు పట్టణంలో విద్యాసంస్థను స్థాపించడం జరిగిందని మా సంస్థలో విద్యను అభ్యసించిన విద్యార్థులు మంచి ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుండి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ డి.నిహారిక క్యాన్సర్ అవగాహన మరియు స్క్రీనింగ్, క్యాన్సర్ రోగులకు క్రమం తప్పకుండా అనుసరించడం, ఇతర క్యాన్సర్ సంబంధిత సంప్రదింపులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని నరాల, గుండె జబ్బుల, క్యాన్సర్ సమస్యలతో బాధపడుతున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. అలాగే గంగిరెడ్డి ఆసుపత్రిలో నూతనంగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని, ఈ సెంటర్‌లో కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయి

– వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షులు గుమ్మళ్ల సాయికుమార్ రెడ్డి



వల్లూరు (చెన్నూరు) : గత సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టోలో తెలుగుదేశం ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి తీరా ప్రభుత్వంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రజలకు మొండి చేయి చేపారని కమలాపురం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గుమ్మల సాయికుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన చెన్నూర్‌లో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నా అంతమందికి తల్లికి వందనం పేరిట తలా రూ.15 వేలు చొప్పున విద్యార్థులు తల్లుల బ్యాంకు ఖాతాలలో జమ చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు ఖరీఫ్ సీజన్లో 20 వేల రూపాయల చొప్పున ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే మహిళలకు మూడు సిలిండర్లు ఉచిత గ్యాస్, ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, ప్రతి మహిళకు నెలకు రూ.1500, యువతకు 20 లక్షలు ఉపాధి అవకాశాలు, లేదా మూడు వేల రూపాయల నిరుద్యోగ భృతి వంటి అనేక ఉచిత హామీలను ఇచ్చి వాటిని అమలు పరచకుండా సంవత్సరం పాటు కాలయాపన చేసి అటు మహిళలను ఇటు నిరుద్యోగులను, విద్యార్థులను అన్నదాతలను మోసం చేయడం జరిగిందన్నారు. ఇవన్నీ కప్పిపుచ్చుకునేందుకు మహానాడు పేరుతో మళ్లీ వాటన్నిటిని అమలుపరిచే విధంగా కల్లిబొల్లి మాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టడం జరిగింది తప్ప, ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి, నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై ఎలాంటి నమ్మకం లేదని ఆయన తెలిపారు. కడప జిల్లా అంటే మొట్టమొదట గుర్తొచ్చేది దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని అలాంటి కడప జిల్లాలో మహానాడు పేరిట మూడు రోజులపాటు సభలు ఏర్పాటు చేసుకుని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించుకోవడం తప్ప, ప్రజలకు మేము ఇది చేశామని చెప్పుకోవడం ఏమీ లేదని తెలిపారు. నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర బడ్జెట్ అంతంత మాత్రమేనని సంక్షేమం అభివద్ధిని ఎలా నెరవేర్చాలో అర్థం కావడం లేదని అనడం ఆయన మేధావితనానికి నిదర్శనమని ఆయన ఎద్దేవా చేశారు. ఇప్పటికే తాము ఏం కోల్పోయామో వారికి అర్థమయిపోయిందని రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలోనే ఈ ప్రభావం బట్టబయలు కాబోతుందని ఆయన కూటమి ప్రభుత్వానికి హితవు పలికారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు ప్రజలలోకి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు.